
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 మార్చి 2023

5

తిరుపతి



గంటన్నర వ్యవధిలో 3.26 లక్షల టిక్కెట్ల బుకింగ్

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు క్యూకడతారు. సీజన్‌తో సంబంధం లేకుండా తిరుమలకు నిత్యం భక్తుల రద్దీతో కిటకిటలాడుతూనే ఉంటాయి. అయితే, ఆన్‌లైన్‌లోనూ శ్రీవారి దర్శనానికి సంబంధించిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. సోమవారం ఉదయం 11గంటలకు రూ.300ల ప్రత్యేక దర్శన టికెట్లను విడుదల చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఏప్రిల్ నెలకు సంబంధించిన 3.26లక్షల టికెట్లను అమ్మకానికి ఆన్‌లైన్‌లో పెట్టారు. అయితే కేవలం గంటన్నర వ్యవధిలోనే ఏప్రిల్ కోటా మొత్తం టికెట్లను బుక్ చేసుకున్నారు భక్తులు. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ నెలా కోటా టికెట్లకు భారీ ఎత్తున డిమాండ్ ఉండే అవకాశం ఉందని ముందే అంచనా వేశారు.టిటిడి అధికారులు. దానికి తగ్గట్టుగానే కేవలం గంటన్నర వ్యవధిలో 3.26లక్షలటికెట్లను బుక్‌చేసుకున్నారు భక్తులు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- కొత్తగా 7 మొబైల్ మెడికల్ యూనిట్లు - 104 వాహనాల ప్రారంభం



నూతన 104 వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే భూమన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే మహోన్నత లక్ష్యంతో పేదవారికి కూడా ఆధునిక వైద్యం ఉచితంగా అందించాలని ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గత అక్టోబర్ 21న ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీని ద్వారా వైద్యసేవలు ప్రజల ముంగిటకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదని 104 వాహనాలు గతంలోనే 32 ఉండగా, అదనంగా నేడు జిల్లాకు అందిన మరో 7 కొత్త 104 వాహనాలను జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, నగర మేయర్ శిరీష, జెసి డికే.బాలాజీతో కలిసి కలెక్టరేట్ నుండి జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోనే వైద్యం అందుబాటులో ఉండేలా ప్రతి 2 వేల మందికి వైఎస్ఆర్. విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో, ప్రజల గడప వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా జిల్లాలోని 436 విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల పరిధిలోని సచివాలయలను కవర్ అయ్యేలా ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండు సార్లు 104 వాహనాలు పర్యటించి వైద్యసేవలు అందిస్తున్నాయని తెలిపారు.

తిరుపతి జిల్లాలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రభుత్వ సెలవులు మినహా నెలలో 26 రోజులు గతంలోని 32 కి నేడు ప్రారంభించిన 7 వాహనాలు వెరసి మొత్తం 39 (104 మొబైల్ మెడికల్ యూనిట్లు) ద్వారా గ్రామాలలో 436 విలేజ్ హెల్త్ క్లినిక్ ల పరిధిలోని అన్ని సచివాలయాలు నెలలో రెండు పర్యాయాలు కవర్ అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి, పిహెచ్‌సిలో ఇద్దరు డాక్టర్ల ఏర్పాటుతో ఒక డాక్టర్ 104 వాహనంతో వెళ్లి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఉదయం ఓపి నిర్వహించి పరీక్షలు చేపట్టి మందులు అందిచడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం డాక్టర్ పాఠశాలలు, అంగన్వాడీలను సందర్శించి వైద్యసేవలు అందించడం, ఆరోగ్యశ్రీ వైద్యచికిత్సలు పొంది ఇంటి వద్దకే పరిమితమైన పేషంట్లకు, వయో భారంతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటి వద్దే వెళ్లి వైద్యఅధికారులు, సిబ్బంది వైద్యసేవలు అందించడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో డి ఎంహెచ్ఓ శ్రీహరి, 104 జిల్లా కోఆర్డినేటర్ శేషశయనా రెడ్డి, డాక్టర్ ఛత్రప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అర్బన్ పిహెచ్‌సి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో భక్తుల రవాణా కోసం

10 విద్యుత్ ధర్మరథాలు

- ప్రారంభించిన టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి - రూ.18 కోట్లతో బస్సులను విరాళంగా అందించిన మేఘా సంస్థ



కొత్త బస్సులకు పూజలు చేస్తున్న టిటిడి ఛైర్మన్ ,ఈవో

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తులను ఉచితంగా రవాణా చేసేందుకు 10 నూతన విద్యుత్ ధర్మరథాలను టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఒలెక్ట్రా సంస్థకు చెందిన రూ.18కోట్లు విలువైన ఈ విద్యుత్ బస్సులను హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ టిటిడికి విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మంతో కలిసి ఛైర్మన్ తిరుమలలోని రాంభగీచా విశ్రాంతి గృహాల వద్ద ధర్మరథాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి డీజిల్ వాహనాల స్థానంలో దశలవారీగా విద్యుత్ వాహనాలు ప్రవేశపెట్టాలని టీటీడీ బోర్డు నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా మొదటిదశలో తిరుమలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు 35 విద్యుత్ కార్లు ఇచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎపిఎస్ఆర్‌టిసి తిరుమల-తిరుపతి మధ్య 65విద్యుత్ బస్సులు నడుపుతోందని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ ఒక్కో బస్సును రూ.1.80 కోట్ల ఖర్చుతో తయారు చేయించి 10బస్సులను టిటిడికి అప్పగించిందన్నారు. తిరుమలలోని వర్క్‌షాప్ సమీపంలో విద్యుత్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ బస్సులు నడిపేందుకు టిటిడి డ్రైవర్లకు ఒలెక్ట్రా సంస్థ శిక్షణ ఇస్తుందని, ఏప్రిల్ 15 నుండి తిరుమలలో భక్తులకు ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కాగా, టిటిడి ఛైర్మన్ ఈవో ఇతర అధికారులు కలిసి తిరుమలలో విద్యుత్ ధర్మరథాల్లో ప్రయాణించి ట్రయల్ రన్ నిర్వహించారు. ఒలెక్ట్రా సంస్థ సిఎండి కెవి.ప్రదీప్, టిటిడి చీఫ్ ఇంజనీర్ శ్రీనాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, విజిఒ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్సులో ప్రయాణిస్తూ..

1 నుంచి నడక మార్గాల్లో దివ్యదర్శనం టోకెన్లు

- వేసవి రద్దీ నేపథ్యంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం
- బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు తగ్గించాలని విఐపిలకు విజ్ఞప్తి
- మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఈవో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: భక్తుల కోరిక మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రయోగాత్మకంగా వారం రోజుల పాటు అలిపిరి మార్గంలో 10 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 5వేల దివ్యదర్శనం టోకెన్లు మంజూరు చేస్తామని, ఆ తరువాత భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఈవో ఏవి.ధర్మారెడ్డితో కలిసి ఛైర్మన్ మీడియా సమావేశం నిర్వహించారు. తిరుమలలో రానున్న వేసవి సెలవుల రద్దీని దష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను తెలియజేశారు. ఏప్రిల్ 15 నుండి జులై 15వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, కావున సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300ల దర్శన టికెట్లు తగ్గించనున్నామన్నారు. ఈ మూడు నెలల పాటు విఐపిలు సిఫారసు లేఖలను తగ్గించాలని కోరారు. సామాన్య భక్తులు శ్రీవారి దర్శనం కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం కల్పించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఆలయ మాడ వీధులు, భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో భక్తులకు కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేస్తామన్నారు. తిరుమలలో 7500కు పైగా గదులు ఉన్నాయి. వీటిలో 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయించడం జరిగింది. ఇటీవల ప్రవేశపెట్టి ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా గదుల కేటాయింపులో పారదర్శకతను పెంచడం జరిగింది. వెంగమాంబ అన్నప్రసాద భవనం, పాత అన్నదానం కాంప్లెక్స్, పిఏసి-2, 4తోపాటు నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని అన్నారు. అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో జలప్రసాద కేంద్రాల ద్వారా భక్తులకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంచుతామన్నారు. మెరుగ్గా పారిశుద్ధ్య ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రధాన కల్యాణకట్ట, మినీ కల్యాణకట్టల్లో నిరంతరాయంగా సేవలందించేందుకు ఏర్పాట్లను చేసున్నామని అన్నారు. భక్తులకు కొరత లేకుండా తగినన్ని లడ్డూలు నిల్వ ఉంచుకుంటామని, టిటిడి విజిలెన్స్, పోలీసుల సమన్వయంతో భక్తులకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంతోపాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి సత్కారం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ ఎస్‌కే.బాబు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు నల్లానిబాబు ఘనంగా సత్కరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నల్లాని బాబు నియమితులయ్యారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీలో తగిన గుర్తింపు కల్పించిన రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు చెవిరెడ్డిని కలసి కతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కషి చేస్తూ జగనన్నకు కతజ్ఞతతో మెలగాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి వారికి సూచించారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు మధు, ఆంజనేయులు, లక్ష్మయ్య, అమరనాథ రెడ్డి, మహేష్ బాబు, మోహన్ లు పాల్గొన్నారు.

అత్యుత్తమ డిజైన్‌లలో అందమైన వజ్రాలు

కీర్తి లాల్స్ ఫరెవర్ మార్క్ అడిగై కలెక్షన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దక్షిణ భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్, డి బీర్స్ ఫరెవర్ మార్క్ వజ్రాలతో రూపొందించిన అడిగై కలెక్షన్‌ను అందిస్తోందని కీర్తిలాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తెలిపారు. ఈ సేకరణ దక్షిణ భారతీయ సంప్రదాయానికి గుర్తుగా ఉందన్నారు. అడిగై కలెక్షన్‌లో 18కేటీ, 22కేటీ బంగారంతో రూపొందించిన, డి బీర్స్ ఫర్ఎవర్ మార్క్ వజ్రాలతో డిజైన్ నెక్లెస్‌లు ఉన్నాయన్నారు. రాబోయే వివాహాలు, పండుగల సీజన్‌కు ఈ సేకరణ సరైనదన్నారు. ఇవి కీర్తిలాల్స్ నైపుణ్యం కలిగిన కళాకారులచే శ్రద్ధతో రూపొందించిన కళాఖండం అన్నారు. ఈసందర్భంగా డీ బీర్స్ ఫరెవర్‌మార్క్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ ప్రతిహారి మాట్లాడుతూ కీర్తిలాల్స్ ఫరెవర్‌మార్క్ అడిగై సేకరణ సహజ వజ్రాలు ప్రత్యేకతను ప్రదర్శిస్తుందన్నారు. రాబోయే పెళ్లిళ్లు పండుగల సీజన్‌లో విలువైన ఆభరణాల కోసం డిమాండ్ ఉన్నందున ఈ సేకరణ ప్రతి భాగానికి వెళ్లే దాని హస్తకళ డిజైన్‌కు మంచి ఆదరణ లభిస్తుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. డిబీర్స్ ఫరెవర్‌మార్క్‌లో ప్రతి వజ్రం అర్థవంతమైన దానికి ప్రతీక అన్నారు. భారతదేశంలోని ప్రముఖ ఆభరణాల వ్యాపారి కీర్తిలాల్స్‌తో భాగస్వామి అయినందుకు గర్విస్తున్నామని తెలిపారు. ఖాతాదారులకు అత్యుత్తమ డిజైన్‌లలో అత్యంత అందమైన వజ్రాలను మాత్రమే స్థిరంగా అందించనున్నామని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు

ఎత్తు తగ్గించకుండా నిర్మించాలి : సిపిఐ


ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి కలెక్టర్ కార్యాయలం ఎదుట సోమవారం ఉదయం పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించడాన్ని నిరసిస్తూ కలెక్టర్ ఆఫీస్ గేట్లు ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏ రామానాయుడు. జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పదేపదే అన్యాయం చేస్తూ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు విప్పకుండా చోద్యం చూస్తూ ఉండడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తుని 135 అడుగులకు తగ్గిస్తూ అక్కడ 92 టీఎంసీల నీటినిల్వను ఏ రకమైన మన రాష్ట్రానికి ఉపయోగపడదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ప్రత్యేక రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలు ఘోరంగా దెబ్బతింటాయని తెలియజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య. జే.విశ్వనాథ్, నదియా, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఏప్రిల్ నెలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసకెళ్ళాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక యశోదానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన జిల్లా విసత స్థాయి సమావేశంలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నష్టాలలో ఉన్నా అదానిని గట్టెక్కించడానికి సహజ వనరులను అప్పనంగా అప్పగిస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై భారాలు పడే బడ్జెట్ అని, అనేక పథకాలకు నిధులు కోత విధించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కొట్టిమిట్టాడుతుందని, ఉద్యోగులకు కూడా ప్రతినెలా జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉందన్నారు. రానున్నది పోరాట కాలమని, హామీల పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభత్వాలు ప్రజల్ని మోసం చేశాయని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతరేకంగా ఏప్రిల్ నెలలో రాజకీయ ప్రచార కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, ఏ.పుల్లయ్య, డి.జనార్ధన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

'స్పందన'కు147 వినతులు

వినతులకు త్వరగా పరిష్కారం చూపాలి : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన, గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, డిఆర్ఓ శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. సంబంధిత గ్రీవెన్స్‌సెల్ అధికారులు అర్జీదారులకు స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. నేడు అందిన అర్జీలు వివరాలు శాఖల వారీగా ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖ 112, స్కిల్ డెవలప్మెంట్ 1, దేవాదాయశాఖ 2, జిల్లా కోఆపరేటివ్ 1, ఆర్ టి ఓ 1, జిల్లా మార్కెటింగ్ ఫేడ్ 1, పౌరసరఫరాల శాఖ 1, సాంఘిక సంక్షేమ శాఖ 1, ఎంపీడీవో 1, వాతావరణం శాఖకు 1, విద్యాశాఖ 1, మునిసిపల్ కమీషనర్ 2, డిపిఓ 1, పంచాయతీ రాజ్‌కు 10, ఎక్సైజ్‌కు 1, హౌసింగ్‌కు 3, విద్యుత్ శాఖకు 2, పోలీస్‌శాఖకు 3, రిజిస్ట్రేషన్ శాఖకు 2 మొత్తంగా147 వినతులు రావడం జరిగిందని, ఈ అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

'స్పందన'లో 75 ఫిర్యాదులు

తిరుపతిసిటీ: తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీలు అడ్మిన్ వెంకట్రావు, లా అండ్ ఆర్డర్ కులశేఖర్ నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి 75 ఫిర్యాదులు అందాయి. తిరుపతి జిల్లా వారి పరిధిలోని ప్రజలు నేరుగా వచ్చి అడిషనల్ ఎస్పీలను కలిసి తమ సమస్యలను తెలియపరిచి వినతులను ఇచ్చినారు. వారు సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరిని కేసు విషయాలు అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులకు తక్షణమే ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందించి ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకార విచారణ జరిపి, నిర్దేశించిన గడువు లోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుంది.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించండి: కమిషనర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను, రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారికి తగుచర్యలు తీసుకుంటామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అధికారులు ప్రజల నుంచి వచ్చిన పిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ వాటిని పరిష్కరించమన్నారు. అలిపిరి ఫ్లైఓవర్, కపిలతీర్థం రోడ్ ఫుట్‌పాత్‌లను మొత్తం ఆక్రమించేసి షాపులు నడుపుతున్నారని, ఇందువలన పార్కింగ్‌కు ఇబ్బందిగా వుందనే ఫోన్‌కాల్ ఫిర్యాదుచేశారు. అలాగే రైతుబజార్ ముందర రోడ్డుపైన తోపుడు బండ్లు, గంపలో అమ్మేవారి వలన రైతు బజారుకు వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా వుందని, అంతేకాకుండా తమకు సరిగా వ్యాపారం జరగడం లేదని రైతుబజారు నుండి వచ్చిన కొంతమంది వ్యాపారులు పిర్యాధు చేశారు. దీంతో స్పందించిన కమిషనర్ అనుపమ మాట్లాడుతూ ఆక్రమణదారులపై తగుచర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడం జరిగింది. కొటకొమ్మల వీధి నుండి ఒకరు పిర్యాదు చేస్తూ చెత్త బండికి స్పీకర్ పని చేయడం లేదని, బండి వచ్చిన విషయం తెలియక ఇబ్బందిగా వుందని చెప్పడంతో కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ చెత్తబండ్లకు స్పీకర్లు పనిచేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలా ప్రాబ్లమ్ వున్న చోట్ల తప్పనిసరిగా అన్ని ఇండ్ల వద్దకు విజిల్ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ పార్క్ వెనుక గంగమ్మగుడి వద్ద చెత్తను డంపు చేస్తూన్నారనే ఫిర్యాదును పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు నంబర్ మూడులోని కైకాల చెరువు ప్రాంతంలో నివాసముండే తమకు రోడ్లు, కాలువలు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు కోరడంతో పరిశిలించి తగు ఏర్పాట్లు చేస్తామన్నారు. శ్రీనగర్ కాలనీ ఐదవ క్రాసులో రోడ్లు, అండర్ డ్రైనేజీ కల్పించాలనే విషయంపై తమ అధికారులు పరిశిలించి తగుచర్యలు చేపడుతారని హామీ ఇచ్చారు. మరికొన్ని ఫిర్యాదులపై తక్షణమే పరిశీలించి తగుచర్యలు చేపడుతారని కమిషనర్ తెలిపారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, రెవెన్యూ అధికారి కెఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



నేడు కలెక్టరేట్‌లో

ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ ఈనెల 28న మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, విజయవాడ వారు జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుండి నిర్వహించనున్నారని ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో ప్రభుత్వ పింఛన్లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ఫ్యామిలీ వెల్ఫేర్ రిటర్న్లు, మిస్సింగ్ క్రెడిట్స్ వంటివి పరిష్కరింపబడతాయని ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

ఈఎస్ఐ స్థలం ఆక్రమణ పై ఫిర్యాదు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరం, రాయలచెరువు రోడ్డులోని (కార్మిక రాజ్య బీమా) ఈఎస్ఐ ఆసుపత్రి మెయిన్ ఎంట్రన్స్ గేట్ పక్కన వున్న ఆసుపత్రికి చెందిన ప్రభుత్వ ఖాళీస్థలంలో ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని అడ్డుకోవాలని ఈఎస్ఐ ఆసుపత్రి అధికారులు, ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులు సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ అధికారులకు పిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్మిక మంత్రిత్వశాఖకు చెందిన ఈఎస్ఐ ఆసుపత్రి స్థలంలో ఆర్‌సి రోడ్డు ప్రధాన రహదారి అనుకోని ఉన్న ఆసుపత్రి స్థలంలో భవిష్యత్తు అవసరాల కోసం చుట్టూ కొంతస్థలాన్ని వదిలి ప్రహరీ గోడను నిర్మించుకొన్నామని, అయితే ఆసుపత్రి ప్రధానగేటు ముందు ఇరువైపులా కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు కట్టడాలు చేస్తున్నారని, ఫలితంగా కార్మికులు, రోగులు లోనికి రావడానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం అక్రమంగా నిర్మాణం చేస్తున్న స్థలంలో కోవిడ్ విపత్కర సమయంలో రెండేళ్ల క్రితం ప్రజల అవసరం కోసం కోవిడ్ రిసెప్షన్ సెంటర్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, రెవిన్యూ అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించాలని విన్నవించారు. వినతి అందజేసిన వారిలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.శ్రీధర్, తిరుపతి ప్రాంతీయ అధికారి రజనీకాంత్, ఈఎస్ఐసి ప్రాంతీయ బోర్డు మెంబెర్ ఎన్.మోహన్ ఉన్నారు.

గంజాయి మాపియాను అరికట్టండి

జనసేన వినతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోనే కాకుండా తిరుమల కొండపై కూడా గంజాయి మాఫియా ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్న తరుణంలో ఈ గంజాయి విక్రయాలకు పాల్పడి యువత భవిష్యత్తులను నాశనం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావుకి జనసేన పార్టీ తరపున సోమవారం వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్, మునుస్వామి, రాజేష్ ఆచారి, కిరణ్ కుమార్, సుజిత్ ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో కలెక్టరేట్ ఎదుట నిరసన



ప్రజాశక్తి-తిరుచానూరు: రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైట్ టు హెల్త్ బిల్లును వ్యతిరేకిస్తూ ఐ.ఎం.ఎ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు జాతీయ ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్ అగర్వాల్ అన్నారు. ఈ సందర్భంగా ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ రాజస్థాన్ ప్రభుత్వం జీవించు వైద్యులకు చీకటి దినంగా భావిస్తున్నామన్నారు. బిల్లును వెనక్కి తీసుకునేంత వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు విజయకుమారి మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని.. మంచి మార్కులను సాధించి తల్లిదండ్రులకు.. పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రియాజ్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రవి, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రాథికేయులు వేణు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలి



ప్రజాశక్తి-ఓజిలి: మధ్యాహ్న భోజన కార్మికురాలిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చావల వెంకటేశ్వర్లు ఎంఈవో శైలజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పున్నేపల్లి గ్రామానికి చెందిన మైలారి వజ్రమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలుగా గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తోంది. రాజకీయ కారణాలతో వజ్రమ్మను గతంలో అకారణంగా నిలిపివేశారని.. తక్షణం ఆమెను విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు అధికార యంత్రాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కార్మికులను ఇబ్బందులు పెట్టడం తగదని హితవు పలికారు. రాజకీయ కారణాల నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథక కార్మికురాలు మైలారి వజ్రమ్మను మానసికంగా వేధించడం అధికార పార్టీకి తగదన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి.గోపాల్, విమలమ్మ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి నిరంతర కృషి



ప్రజాశక్తి- రేణిగుంట: విప్పమానుపట్టెడ పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి తెలిపారు. వేమూర్తురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో వైయస్సార్ క్లినిక్ సిబ్బందికి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు ఆరోగ్య కిట్లను ఆయన అందించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని కోరారు. ఎండలకు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశయ సాధనకు.. అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో తిరుపతి బైరాగి పట్టెడలోని శ్రీ చైతన్య ఐపీఎల్ బ్రాంచ్‌కు చెందిన 236 మంది విద్యార్థులు ఘన విజయం సాధించారని ప్రిన్సిపల్ అన్నపూర్ణ సోమవారం తెలిపారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకొని వివిధ పోటీ పరీక్షల్లో రాణించాలని ప్రశంసించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏవో రవిబాబు, డీన్ శివరాజు, ఐపీఎల్ ఇన్చార్జ్ కృష్ణమూర్తి, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి వివి రెడ్డి, సివిల్స్ ఇన్‌ఛార్జి ఆముక్త, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని పిల్లల్ని అభినందించారు.

దివ్యాంగులకు రోటరీక్లబ్ భరోసా



ప్రజాశక్తి-గూడూరు టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 16 మంది దివ్యాంగులకు నెలకు సరిపోయే సరకులను దాత ప్రాస్పరో స్కూల్ అధినేత దశరథరామిరెడ్డి తన వదిన బుస్సా రెడ్డి కుంతలమ్మ జ్ఞాపకార్థం అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ధనంజయరెడ్డి, రోటరీ సభ్యులు బొమ్మిడి శ్రీనివాసులు, వాసు గౌడ్, సేగు శ్రీనివాసులు, హరి, ప్రశాంత్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, సూర్య ఫ్యాన్సీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



ప్రజాశక్తి-క్యాంపస్: యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర చిత్తూర్ జిల్లా వారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాకు సంబంధించిన జిల్లాస్థాయి నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో గల ఇందిరా ప్రియదర్శిని హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రాజకీయాలలో యువత పాత్ర, స్వచ్ఛభారత్, ఆయుష్మాన్ భారత్ వంటి అంశాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి తుడ సెక్రెటరీ ఎస్ లక్ష్మి, విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప నాయుడు ముఖ్యఅతిధులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎస్ లక్ష్మి మాట్లాడుతూ యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని రాజకీయాల్లో కూడా రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ పలు పథకాల గురించి యువత మధ్య చర్చ జరగడంతో ఆ పథకాలు ఇంకా ప్రజలు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ బి. ప్రదీప్ కుమార్, ప్రధానాచర్యులు డా. మాధురి పరదేశి, , మహర్షి అభ్యుదయ సేవా సంస్థ అధ్యక్షులు కె జ్ఞానశేఖర్‌రెడ్డి, యోగ అసోసియేషన్ ఆఫ్ చిత్తూర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

కోటలో ఆక్రమణలు తొలగేనా..!

- 333 మందికి అధికారులు నోటీసుల జారీ
- తొలగని ట్రాఫిక్ సమస్యలు



ప్రజాశక్తి-కోట: గత 20 ఏళ్లగా కోటలోని ఆక్రమణలు తొలగించేందుకు ఎన్నోసార్లు అధికారులు ప్రయత్నాలు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో తాత్కాలికంగా నిలుపుదల జరుగుతూవస్తోంది. అయితే ఇటీవల గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ చొరవతో కోటలోని ఆక్రమణలు తొలగించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ క్రమంలో సర్వేను పూర్తి చేసి సోమవారం కోట మండల తహశీల్దారు కార్యాలయంలో ఆక్రమణదారుల నివేదికను బహిరంగం చేశారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ ఆక్రమణదారులైన 333 మందికి నోటీసులు జారీ చేశామని.. ఎవరికైనా అభ్యంతరాలుంటే ఫోన్‌నంబర్లు 9281007018, 9440133411 లను సంప్రదించాలని కోరారు. కోట క్రాస్ రోడ్డు నుంచి కొక్కుపాడు పెట్రోల్ బంకు వరకు, అలాగే నల్లపురెడ్డి ఇంటి వద్ద నుంచి దాద రాయగుంట వరకు ఆక్రమణలకు గురైన భవనాలను తొలగించడానికి ఆర్ అండ్ బీ అధికారులు శ్రీకారం చుట్టడం ఇదివరకే తెలిసిందే. గత కొద్ది రోజుల క్రితం కోట క్రాస్ రోడ్డు నుండి కోట బస్టాండుకు సమీపంలో ఉన్న వినాయకుని గుడి వరకు రోడ్డు వెడల్పు చేస్తున్నారు. అయితే రోడ్డు వెడల్పు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రతిఒక్కరికీ ఉపయోగకరంగా ఉండనుంది. ఇటీవలన ఆర్ అండ్ బీ అధికారులు క్రాస్ రోడ్డు నుంచి వినాయక గుడి వరకు తాత్కాలిక మరమ్మతులు హడావుడిగా పనులు జరిగాయి. కోట పట్టణ పరిధిలోని బజారులో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉంది. నిజంగా కోట బజారులో ఆక్రమణలు తొలిగిస్తారా.. లేదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆర్ అండ్ బీ అధికారులను కోట బజారులో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉందని, బజారులో ఆక్రమణ పనులు చేపట్టకుండా మిగిలిన చోట్ల ఆక్రమణలు చేపట్టడం ఏంటని అడగగా బజారులో ఉండే ఆక్రమణదారులకు నోటీసులు అందజేశామని తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బి అధికారులు మాట్లాడుతూ కోట పంచాయతీ పరిధిలో 333 మంది ఆక్రమణదారులకు నోటీసులు అందజేశామన్నారు. ఈ మేరకు నల్లపరెడ్డి నివాసం వద్ద నుండి దాదరాయిగుంట వద్ద వరకు ఎడమవైపు 37 మందికి, కుడివైపు 25 మందికి, అలాగే కోట క్రాస్ రోడ్డు నుండి కొక్కుపాడు రోడ్డు పెట్రోల్ బంక్ వరకు ఎడమవైపు 143 మందికి, కుడిపైపు 128 మందికి నోటీసులు పంపామన్నారు. చివరకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నల్లపరెడ్డి ఇంటి ముందు వరకు కొక్కుపాడు రోడ్డు పెట్రోల్ బంక్ వరకు, దాదరాయిగుంట వరకు ఆక్రమణలు తొలిగిస్తారా.. నోటీసులుకు పరిమితం చేస్తారా వేచిచూడాల్సి ఉంది. కోట బజారులో ఆక్రమణలు తొలిగించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషిచేద్దాం..!

సదస్సులో జడ్పీటీసీ విజయలక్ష్మి





ప్రజాశక్తి-సత్యవేడు: ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ప్రోత్సహించాలని తిరుపతి జిల్లా సత్యవేడు జడ్పీటీసీ విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో దేవ కుమారి ఆధ్వర్యంలో పోషన్ పక్వాడాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ఈ సందర్భంగా విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పోషన్ పక్వాడా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మాతృశిశు మరణాలను గణనీయంగా తగ్గించాలన్నారు. రాగి జావా తాగడంతో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తహీనత, బీపీ, గుండె జబ్బులు దరిచేరే అవకాశాలు ఉండదన్నారు. వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాగి పిండి, అటుకులు, సపోటో, జామ వంటి పండ్లను అధికంగా తీసుకోవడం ఆరోగ్యకరమన్నారు. ఇందులో అనేక రకాల పోషక విలువలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రతి ఇంట్లోనూ దొరికే మునగాకు బలవర్ధకమైన ఆహారం అన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు సమతుల్య ఆహారం పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీడీవో బాలగణేష్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో కనీసం నెలకు ఒక రోజైనా పోషక ఆహార ప్రాముఖ్యతపై వివిధ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రదర్శనలో ఉంచాలన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరుకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. ఈ సందర్భంగా పలు వంటకాలను ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో మండల పరిషత్తు కో ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఏపీఎం స్వర్ణలత, సీసీ జీవా, ఉపాధి ఇన్‌ఛార్జి ఏపీవో లోకమ్మ, ఎంఈవో రవి, దాసుకుప్పం పీహెచ్సీ ఎంపీహెచ్‌వో వెంకటరమణ, మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్ శివయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.


దొరవారిసత్రం: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సూళ్లూరుపేట సీడీపీవో శారదాంబ ఆధ్వర్యంలో 'పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దొరవారిసత్రం సెక్టార్ కు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ మహిత, ఆరోగ్య సిబ్బంది సీహెచ్‌వో, కార్యకర్తలు జానకమ్మ, లీలమ్మ, ప్రసన్న, మమత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా వడమాలపేట మండలం శ్రీ బొమ్మరాజపురం పంచాయతీలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వంద రోజులలో వర్గీకరణ చేస్తానన్న బీజేపీ గత తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న ఎస్సీ వర్గీకరణ అంశంపై మౌనం వీడాలన్నారు. పార్లమెంటు సమావేశంలో వర్గీకరణ కోసం చట్టబద్ధత కల్పించాలని.. ఈనెల 31న ఎంఎస్పీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో ఆర్డినేటర్ నరేంద్రబాబు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాలోని మాదిగలు తరలిరావాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పులికుంట్ల గోపి, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వాసు, నగరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి శివ, తిరుపతి రూరల్ ఇన్‌ఛార్జి జానకిరామ్, లక్ష్మయ్య, కుంచం మాతయ్య, వెంకటయ్య, చెంగయ్య, గెడ్డం మాతయ్య, కుంచం వినోద్, బాబీ, ప్రదీప్, రాజేష్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రంలో సత్వర అభివృద్ధి





ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాలు, సత్వర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. పుత్తూరు పొదుపు సంఘాల మహిళలకు మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం వై.యస్.ఆర్ ఆసరా మూడో విడత పంపిణీ చేపట్టారు. జిల్లా అధికారి జ్యోతి, మున్సిపల్ కమిషనర్. కే ఎల్ ఎం ఎన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంపీపీ మునివేలమ్మ పాల్గొని పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ మహిళా ముఖ్యమంత్రులు కూడా మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు లభించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ శంకర్, వైస్ ఛైర్మన్ జయ ప్రకాష్, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, మహిళా సంఘ లీడర్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: నారాయణవనం మండల కేంద్రంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం (టాస్క్ ఫోర్స్) అధికారులకు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సోమ వారం టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని పోలీస్ యూనిట్ హాస్పిటల్ లో డీఎస్పీ, ఆర్ఐ, సీఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, కూంబింగ్ సిబ్బందికి ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత అడవుల్లో కూంబింగ్ చేసే సిబ్బందికి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం టాస్క్ ఫోర్స్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్ మనోవికాస్‌కు లయన్స్ క్లబ్ చేయూత



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పద్మావతీపురంలోని బుద్ధిమాంద్యం అనాథ పిల్లల సంరక్షణ కేంద్రం పాస్ మనోవికాస్ కు లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అధ్వర్యంలో సుమారు 100 మంది పిల్లలకు వారానికి సరిపడ చాక్లెట్లు, బిస్కెట్లు వితరణగా అందించారు. పాస్ మనోవికాస్ ఇన్‌ఛార్జి మురళి, లయన్స్ క్లబ్ కార్యదర్శి వి. జగన్నాధం, ఐఎస్.విశ్వనాధ్, బాసికర్ల రఘు, రామారావు, పాస్ మనోవికాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బార్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్‌నాయుడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా మాడుపూరు ప్రసాద్ నాయుడు ఏకగ్రీవంగా మరోమారు ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ప్రెసిడెంట్ గా గా మాడుపూరు ప్రసాద్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ గా మల్లికార్జునయ్య , సెక్రటరీ గా కడూరు కమల్ కుమార్ ఎన్నికయ్యారు.

చిందేపల్లి రోడ్డు కోసం నిరాహార దీక్ష



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చిందేపల్లి రోడ్డు సమస్య పరిష్కారం కోసం జనసేన నియోజకవర్గం ఇన్చార్జి వినుత కోటా సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. చిందేపల్లి శివాలయం వద్ద ఈ దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ రోడ్డు సమస్య తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదన్నారు. అధికారులు రోడ్డు సమస్యకు పరిష్కారం ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో కలిసి ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇక మరో మార్గం లేక గ్రామస్థులతో కలిసి నిరాహార దీక్షకు దిగక తప్పలేదని చెప్పారు. చిందేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పై కట్టిన అక్రమ గోడను తొలగించే వరకు దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట- కడప జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన షేక్ ఇబ్రహీం (21), షేక్ మహమ్మద్ ముషాబర్‌బాషా (30)లు చెన్నైలో విధులు ముగించుకొని బైక్‌లో రైల్వేకోడూరుకి బయలుదేరారు. అర్ధరాత్రి బైక్‌లో వెళ్తుండగా మండలంలోని కుక్కల దొడ్డికి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆరోపణదారులపై చర్యలు తీసుకుంటాం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రసన్న వరదరాజస్వామి మూలవిరాట్టు తొలగింపు ప్రక్రియలో పానమట్టం కింద లభ్యమైన బంగారు నాణేలను అమ్మకానికి పెట్టారంటూ ఆరోపణలు చేసి ఆలయ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసిన వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని ఈవో సాగర్ బాబు స్పష్టం చేశారు. స్థానిక ఆలయ పరిపాలన భవనంలో ఈవో సాగర్ బాబు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి టీడీపీ నేతల నిందారోపణలను ఖండించారు. వరదుడి మూలవిరాట్టు ప్రక్రియ పారదర్శకంగానూ, గట్టి భద్రత నడుమ సజావుగా సాగిందన్నారు. అక్కడ జరిగిన ప్రతి సన్నివేశాన్ని వీడియో చిత్రీకరించామని తెలియజేశారు. మూలవిరాట్ తొలగింపు కార్యక్రమం పై మూడు రోజుల ముందుగానే మీడియా ముఖంగా ప్రజలకు తెలియపరిచామని వివరించారు. అయితే కొందరు టిడిపి నేతలు వరదుడి మూలవిరాట్టు తొలగింపు ప్రక్రియ సజావుగా సాగలేదనీ, పానమట్టం కింద లభించిన బంగారు నాణేలను దాచి అమ్మకానికి పెట్టారని ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. ఈనెల 17న జరిగిన వరదరాజ స్వామి మూలవిరాట్టు తొలగింపు ప్రక్రియ వీడియో దృశ్యాలను మీడియా ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. స్వామి వారి పానమట్టం కింద లభ్యమైన 37 బంగారు రేకులనూ, రెండు బంగారు నాణేలను, 12 నవరత్నాలను శుభ్రపరిచి భద్రంగా లాకర్లలో దాచామని వివరణ ఇచ్చారు. పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



ప్రజాశక్తి-బాలాయపల్లి : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాజులపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు.కార్యక్రమంలో మండల శాఖ అధికారులు, నాయకులు చెలికం చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ గణనపై చర్చించాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పార్లమెంటు సమావేశాలు బీసీల జన గణన పై చర్చించి జనగణన జరిగేలా చర్యలు తీసుకునేలా పోరాడాలని తిరుపతి ఎంపీ మద్దిలో గురుమూర్తికి సోమవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచార్య ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నత కోసం, క్షేత్రస్థాయిలో బీసీల ఐక్యత చాటడానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షులుగా కల్లూరి నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా మధు మార్గాచార్యులు, తిరుపతి నగర అధ్యక్షురాలుగా యశోద, తిరుపతి రూరల్ అద్యక్షులుగా ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా రాజేంద్ర, జయచంద్ర గౌడ్లను ఎన్నుకున్నామన్నారు.

ఘనంగా వార్షిక క్రీడా వేడుకలు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరు సాయిరాం పాఠశాలలో సోమవారం వార్షిక క్రీడా వేడుకలు నిర్వాహకులు ఎ.గంగయ్య, జి.గిరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఎంఈవో హేమమాలిని మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని సాంస్కతిక, క్రీడా రంగంలో ముందంజలో ఉన్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు అందరూ మంచిగా శిక్షణ పొంది పాఠశాలకు, మండలానికి మంచి ప్రతిభను చేకూర్చాలని విన్నవించారు. కార్యక్రమంలో పీఈటీ జబరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా సునంద బాధ్యతలు



ప్రజాశక్తి- పిచ్చాటూరు: నాగలాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సునంద పద్మనాభం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు.